డిటెక్టివ్ కథ

# యమగండం

**వి.యస్.రావ్**

''సామజవరగమనా!''

కళ్యాణ మంటపంలో వేదికమీద పద్మాసనం వేసుక్కూచున్న యువతి కళ్ళు మూసుకుని, ఒకానొక గాయనీమణిని అనుకరిస్తూ పాడుతోంది.

డిటెక్టివ్ టెంపో కుర్చీలో వెనక్కివాలి, ఆమెనే చూస్తూ వినసాగేడు.

పక్కనే కూచున్న క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ టెంపో చేతిమీద తన చేతిని వేస్తూ తలదగ్గరగా వాల్చాడు. టెంపో ఎడమచెవిని పృథ్వీరావ్‌కి అప్పగించాడు.

''చాలాకాలంగా వున్న సందేహం...'' పృథ్వీరావ్ తగ్గుస్వరంలో అన్నాడు. 'సామజవరగమనా' అంటే ఏమిటి గురూ?

డిటెక్టివ్ టెంపో చప్పుడుచేస్తూ నిట్టూర్చాడు. ''చిక్కుప్రశ్నే! 'డెమో' లేకపోతే అర్థం కాదు! ఒక పని చెయ్! అదిగో... పెళ్ళికొడుకు కూచున్న మండపం వైపు పళ్ళేలు పట్టుకుని నడుస్తున్నారు చూడు...! 'సామజవరగమనలు' అంటే వాళ్ళన్నమాట!''

''అంటే... ముత్తైదువులా?'' పృథ్వీరావ్ అమాయకంగా అడిగాడు.

''అంటే గొప్ప ఏనుగులాగా – అంటే మదించిన ఏనుగు లాగా – అందంగా, మందంగా, హుందాగా – గంభీరంగా మతులు పోగొట్టేలా నడిచే అందగత్తెలని అర్థం! అలాంటివాళ్ళని మదగజగమనలనీ, మత్తేభగామినులనీ, సామజవరగమలనీ అంటారన్నమాట!''

''అంటే ఆ పాట...'' పృథ్వీరావ్ ఏదో అడగబోయాడు.

''త్యాగరాజస్వామి వారు శ్రీరాముడు గురించి రాశార్లే పృథ్వీ! ఆ శ్రీరాముడు కూడా మదగజగమనుడట! మత్తేభంలాగా, అందంగా, హుందాగా నడిచే అందగాడట! అంటే... ఇదిగో... వింటున్నావా?''

''లేదు. చూస్తున్నాను. సామజవరగమనలను!'' పృథ్వీరావ్ చూపులు తిప్పకుండా అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ చూపులకు అడ్డంగా ఆగాడు, కొబ్బరిబొండాలు అందిస్తున్న వ్యక్తి. స్ట్రా వేసిన కొబ్బరి బొండాన్ని డిటెక్టివ్ టెంపోకి అందించి, మరొకటి పృథ్వీరావ్‌కి యిచ్చాడావ్యక్తి. 'సామజవరగమనా' అంటే ఏమిటో ప్రాక్టికల్‌గా అర్థం చేసుకునే కార్యక్రమానికి అడ్డు తగిలిన బొండాం వ్యక్తి వైపు కోపంగా చూశాడు పృథ్వీరావ్.

గిరజాల జుట్టు. బుర్రమీసాలు... లుంగీమీద.. పల్చటి జుబ్బా... కొబ్బరి బొండాం వ్యక్తి, రూపం పృథ్వీరావ్ మెదుడులో ఏవో జ్ఞాపకాల తెరల్ని చకచకా తొలగిస్తోంది.

''ఏయ్... ఇలారా!'' ముందుకెళ్ళబోతున్న బొండాం వ్యక్తిని పిలిచాడు పృథ్వీరావ్?

ఆ వ్యక్తి రెండడుగులు వెనక్కివేసి, ఆగి, భయంగా పృథ్వీరావ్ వైపు చూశాడు.

''నువ్వు... నువ్వు... పాతకేడీ దుర్గయ్యవి కదూ!''

బొండాం వ్యక్తి కళ్ళు అటుయిటూ కదిలాయి. ''నా పేరేమో దురగయ్యే బాబూ! పాత కేడి మాత్రం కాదండీ!''

''నేనెవరో తెల్సా! ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్‌ని! ఆరేళ్ళ క్రిందట నీకు మూడేళ్ళు జైలు శిక్ష వేయించా! గుర్తు లేదా?''

''బాబ్బాబు... మన్నించేయండి! తమర్నెలా మరిసిపోతానండి! గురుతు పట్టే కదండీ, పెద్ద బొండాం యిచ్చాను!...''

''ఏమిటి కథ! ఇక్కడ ప్రత్యక్షమయ్యావ్?'' పృథ్వీరావ్ కళ్ళెగరేస్తూ అడిగాడు. ''పెళ్ళి మండపంలోకి పెద్ద ప్లాన్‌తో వచ్చావా?''

''రామరామ! జైల్నుంచీ వొచ్చాక – వృత్తి మానేసి, 'జనజీవనసరవంతలో కలిసి పొయాన్దొరా! ఇదిగో... యిలా కాయకట్టం జేసుకుని, గౌరవంగా పెద్దమడిసిలా బతుకెళ్ళదిస్తా వున్నా!'' దుర్గయ్య మహా వినయంగా అన్నాడు.

''ఊ! ఈ కల్యాణ మండపానికి ఎంతమందిని తీసుకొచ్చావ్, కేడీ వెధవల్ని?'' పృథ్వీరావ్ తీక్షణంగా చూస్తూ అడిగాడు.

''ఆరుగురున్నారు దొరా! జైల్లో వున్నప్పుడే ఆళ్ళల్లో మార్పుదెప్పించేసి, బైట పడగానే జనజీవన సరవంతిలో కలిపేశానయ్యా! అమ్మతోడు దొరా! అందరం ఇప్పుడు సెమటోడ్చి బతికేత్తున్నాం...''

''ఊ! జాగర్త! ఆ 'జనజీవన సరవంతి'లోనే కంటిన్యూ అయిపో! 'చోర జీవన సరవంతి'లో కెళ్ళావో...'' పృథ్వీరావ్ మాటపూర్తి చేయకుండా ఆపేశాడు.

''ఎంతమాట దొరా! ఇటు తిరిగేశాను! ఇంక అటుతిరిగే ఇదే లేదు! ఇంకో రొండు బొండాలు తాగుతారా, దొరా?'' దుర్గయ్య వినయంగా అడిగాడు.

''వద్దు! వెళ్ళు!'' పృథ్వీరావ్ ఉరిమి చూస్తూ అన్నాడు.

దుర్గయ్య నాలుగైదు వరసలు దాటి, వేగంగా వెళ్ళిపోయాడు.

''సింహం నక్కలను గుర్తు పట్టేసినట్టు. కేడీల్ని గుర్తు పట్టేస్తున్నావ్!'' డిటెక్టివ్ టెంపో నవ్వుతూ అన్నాడు.

''అలవాటు! వాసనొచ్చేస్తుంది! చూడగానే దొంగల్ని పసి గట్టేస్తాం'' పృథ్వీరావ్ సగర్వంగా అన్నాడు. ''కేడీగాళ్ళంతా, ఇవాళా రేపూ మ్యారేజ్ కాంట్రాక్టర్స్ వద్దా, కేటరింగ్ వాళ్ళవద్దా చేరిపోయి, కల్యాణమండపాలలో 'కరసేవ' చేయడం ప్రారంభించారు!''

''దొంగలు మీ పోలీసు వాళ్ళకన్నా తెలివైన వాళ్ళు!'' టెంపో నవ్వుతూ అన్నాడు.

''అది జనంలో వున్న పొరపాటు అభిప్రాయం!'' అంటూ పృథ్వీరావ్, కొంచెం దూరంలో గెడకర్రలా నిలుచున్న వ్యక్తికి సైగ చేశాడు.

ఆ వ్యక్తి వినయంగా వచ్చి, నిటూరుగా నిలుచున్నాడు. ''రత్నం ఇందాక బొండాంగాడితో మాట్లాడాను..''

''చూశాను సార్..'' మఫ్టీలో వున్న కానిస్టేబుల్ రత్నం అన్నాడు.

''వాణ్ని ఫాలోచెయ్! వాడు గ్యాంగ్ లీడర్! క్యాటరింగ్ గ్రూప్‌లో, కాంట్రాక్టర్ గ్రూప్‌లో కలిసి పోయింటారు... ఎవరెవరో గుర్తుంచుకో! ఎందరున్నారో లెక్క

పెట్టు! ఫోర్ ఫార్టీ ఫోర్‌ని తీసుకెళ్ళు!'' పృథ్వీరావ్ ఉత్త ర్వులిచ్చాడు.

''యస్సర్!'' రత్నం దూరంగా జరిగాడు.

''పృథ్వీ! నువ్వు పెళ్ళికొచ్చావా? పెళ్ళి దొంగల్ని పట్టడానికొచ్చావా?'' డిటెక్టివ్ టెంపో నవ్వుతూ అడి గాడు.

''సింగిల్ విజిట్! డబుల్ వర్క్!'' పృథ్వీరావ్ నవ్వుతూ అన్నాడు.

''ఇదిగో... కైలాసం గారొస్తున్నారు!''

దగ్గరగా వస్తున్న వధువు వందన తండ్రి కైలాసం గారిని చూస్తూ, టెంపో, పృథ్వీరావ్ ఇద్దరూ పైకి లేచారు; మర్యాదపూర్వకంగా. కైలాసంగారితో పాటు మరొక పెద్దమనిషి వున్నాడు.

''బావగారూ! ఈయన డిటెక్టివ్ టెంపోగారు; ఈయన క్రైం బ్రాంచి ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ గారు! అమ్మాయి వందన అంటే ఇద్దరికీ ప్రాణం!'' అంటూ కైలాసం గారు టెంపో వైపు చూశాడు. ''ఈయన వైకుంఠం గారు; మా వియ్యంకులు!''

''వియ్యంకుల పేర్లు చాలా బాగా కలిశాయి!'' డిటెక్టివ్ టెంపో నవ్వుతూ అన్నాడు. 'కైలాసం; వైకుంఠం!''

''మా పేర్లే కాదు; టెంపో గారూ: మా పిల్లల పేర్లు కూడా పాలు తేనెల్లా కలిసి పోయాయి! అందుకే కైలాసం బావగారితో ఏరికోరీ వియ్యమందు తున్నాం!'' వైకుంఠం నవ్వుతూ అన్నాడు.

''టెంపోగారూ... మళ్ళీ కలుద్దాం! వందన మీ ఇద్దరితోటీ ఫొటోలు దిగాలంది! తనకి మీరిచ్చే ప్రెజెం టేషన్ అదేట!'' అంటూ కైలాసం గారు వెనుదిరి గారు. వైకుంఠం తలపంకించి, కైలాసం గారి వెంట కదిలాడు...

టెంపో దూరంలో వున్న కిటికీ వైపు నడిచాడు. పృథ్వీరావ్ అనుసరించాడు. కిటికీ దగ్గరగా ఆగి, టెంపో సిగరెట్ పాకెట్ తీశాడు. ఇద్దరూ సిగరెట్లు వెలి గించారు.

''.... సామజవరగమనా...''' అంటూ పొడుగ్గా రాగం తీస్తూ కీర్తన ముగించింది పాటకత్తె.

''సామజవరగమనా!'' ఎంత చక్కటి పదమో ఇప్పటికి పూర్తిగా అర్థమైంది గురూ:'' పృథ్వీరావ్ సాభిప్రాయంగా అన్నాడు. ''పట్టుచీరలు కట్టినా, పంజాబీ డ్రెస్సు తొడిగినా – సామజవరగమనలు, సామజవరగమనలే!''

పట్టుచీరల్లో, పంజాబీ దుస్తుల్లో అటుయిటూ తిరు గుతున్న ఆడవాళ్ళను చూస్తూ ఉషారుగా అంటున్న పృథ్వీరావ్‌ని చిరునవ్వుతో చూశాడు టెంపో.

''పృథ్వీ, ఒక సలహా! ఆకలిగా చూడొద్దు; ఆరాధ నగా చూశాడు!''

''ఏం?'' అట్నుంచీ చూపుతిప్పకుండా అడిగాడు పృథ్వీరావ్?

''ఏం లేదు... సాదా సీదాగా మఫ్టీలో వున్నావ్! యూనిఫామ్ కవచం కూడా లేదు!'' టెంపో నవ్వుతో అన్నాడు.

కానిస్టేబుల్ రత్నం ఫోర్ పార్టీఫోర్‌తో కలిసి వాళ్ళ దగ్గరగా వచ్చాడు. అతని వైపు పొగచక్రం వదిలి, పృథ్వీరావ్ ప్రశ్నార్థకంగా చూశాడు.

''బొండాం గాడు కాకుండా ఆరుగున్నారు సార్!'' రత్నం వినయంగా అన్నాడు.

''గుడ్! ఎలా కనిపెట్టారోయ్?'' పృథ్వీరావ్ ప్రశ్నించాడు.

''వాళ్ళే మనల్ని కనిపెట్టేస్తున్నారు సార్! మఫ్టీలో వున్నా కూడా, ఒక్క చూపులో మమ్మల్ని కనిపెట్టేసి, కంగారుగా రియాక్టై పోయారు సార్! వాళ్ళను కని పెట్టడంలో, వాళ్ళే మనకు సహాయం చేశారు సార్!''

''పలకరించి కన్‌ఫర్మ్ చేసుకుని మరీ వచ్చాం సార్! 'జనజీవన స్రవంతి'లో కలిసి పోయాం!' అంటూ అందరిదీ ఒకేమాట సార్!'' ఫోర్ ఫార్టీ ఫోర్ అన్నాడు.

''వాళ్ళు కేటుగాళ్ళు! మళ్ళీ వాళ్ళ కంటపడ కుండా ఒక కన్నేసి వుంచండి! గో!'' పృథ్వీరావ్ ఉత్తరు విచ్చాడు.

కానిస్టేబుల్స్ వెళ్ళిపోయారు.

''ఇప్పుడు నిర్థారణై పోయిందిగా పృథ్వీ; మీకంటే దొంగలే తెలివైన ఘటాలని!'' డిటెక్టివ్ టెంపో నవ్వుతూ అన్నాడు.

పృథ్వీరావ్ వినిపించుకోనట్టు, 'సామజవరగ మనా!' అంటూ పాడసాగేడు...

ఉన్నట్టుండి కల్యాణ మంటపంలో మంత్రాలు ఊపందుకున్నాయి. ముందు వరస కుర్చీల్లో కూచున్న డిటెక్టివ్ టెంపో; ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ కల్యాణ వేదిక వైపు చూశారు. వధూవరులు పక్క పక్కనే కూచున్నారు.


''అయ్యా... జీలకర్రా, బెల్లం తంతు అయిపో



యింది. మాంగల్యధారణకు శలవా?'' సిద్ధాంతి మంత్రం ఆపి అడిగాడు.

''ఆగవయ్యా సిద్ధాంతీ! ఏమిటా తొందర?'' వరుని తండ్రి వైకుంఠం గోచీ బిగించుకుంటూ వేదిక ఎక్కి కసిరాడు.

''తొందరంటే తొందరేనండి! ముహూర్తం ముంచుకొచ్చేస్తోంది!'' సిద్ధాంతి చేతి గడియారం చూసుకుంటూ అన్నాడు ''శాస్త్రోక్తంగా సకల



తంతులూ చక్కగా జరిపించేశా! మిగిలింది మాంగల్యధారణే!''

''నువ్వు ముగించావు! ఇక్కడ మా వియ్యంకులు మగిం చాలి కద!'' వైకుంఠం కైలాసం వైపు చూస్తూ అన్నాడు.

''బావగారూ...?'' కైలాసం అర్థం కానట్టు చూస్తూ అన్నాడు.

''ఏంటి బావగారూ! అన్నీ నేన్చెప్పాలా? అమ్మాయికి మీరు పెట్టాల్సిన వడ్డా ణమూ, సెట్టు నగలూ, అబ్బాయికి బ్రేస్‌లెట్టు అయిదే వేళ్ళకూ ఆరు ఉంగరాలు పెట్టరా ఏంటి?''

''ఓ... అదా!'' కైలాసం తేలిగ్గా ఊపిరి పీల్చుకుంటూ అన్నాడు.

''ఎందుకు పెట్టం బావగారూ? 'నాగవల్లి'లో లక్షణంగా పెట్టేస్తాంగా!''

''అవునండీ వైకుంఠంగారూ! ఆ నగా నట్రా నగదూ గిగదూ నాగవల్లి లాంఛనాలు! ముందు మాంగల్య...''

''నువ్వుండవయ్యా! నువ్వు చెప్పినట్టే ముందు ఆ మూడు ముళ్ళు వేసేస్తాం! ఓ పనై పోతుంది! ఆ తరువాత పిల్లతండ్రి 'నగలిప్పుడు లేవూ, తరువాత నెమ్మదిగా చూద్దాం!'' అంటాడు! అప్పుడు, మాపనై పోతుంది!'' వైకుంఠం బిగ్గరగా అన్నాడు.



# మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

## మోనాలిసా

అరచేతిలో వైకుంఠం చూపించేవాళ్లకు ఈ లోకంలో కొదవలేదు. తెల్లారేసరికి కోట్లు సంపాదిస్తే యిక జీవితకాలమంతా కాలుమీద కాలేసుకుని గడపవచ్చు. అయితే, ఏ వ్యాపారం చెయ్యాలన్నా మొదట కొంత పెట్టుబడి కావాలి.

"అబ్బే ఎక్కువ అక్కర్లేదు. పాతిక లక్షలు మాత్రమే. ఆ తర్వాత ఎన్ని కోట్లు వచ్చి పడతాయో నువ్వూహించను కూడా ఊహించలేవు. ఈ రహస్యం మూడో మనిషికి తెలియకూడదు. లియొనార్డో డావించీ గీసిన మోనాలిసా గురించి విన్నావు గద" అంటూ ప్రారంభించాడు మిస్టర్ రాంబాబు.

"ఆ చిత్రం పారిస్‌లో ఉందని తెలుసు"

"లోకమంతా అలాగే అనుకుంటుంది. ఆ బొమ్మను 1911లో ఎవరో దొంగిలించారు. ఆ తర్వాత దొరికిందన్నారు గాని, ఆ దొరికింది నకిలీది. నకిలీలు తయారు చెయ్యటంలో సిద్ధహస్తుడైన ప్రముఖ జపనీస్ చిత్రకారుడు యక్కీ యకామెకో దాని డూప్లికేటు తయారు చేశాడు. ఇప్పుడు పారిస్‌లో వున్నదదే. ఒరిజినల్ మోనాలిసా టోక్యోలో ఒక వ్యక్తివద్ద ఉందని తెలిసింది. దానిమీద నిఘా ఎక్కువగా వుండటంతో, రహస్యంగా అమ్మేయ్యాలనుకుంటున్నాడు. అయితే మనం చట్ట వ్యతిరేకమైన పనులేమీ చెయ్యక్కర్లేదు. ఓ కాంట్రాక్టు మనిషి ఆ కాన్వాసుని రోల్ చేసి సిల్కుగుడ్డలో చుట్టి మనకు చేరుస్తాడు. ఆ తర్వాత మనం దాన్ని ఎంతకు అమ్ముకుంటామనేదానికి ఆకాశమే హద్దు"

"నాన్సెన్స్.. పాతిక లక్షలు కాదు గదా, చిల్లిగవ్వ కూడా యివ్వను" అన్నాడు మోనాలిసా గుట్టు తెలిసిన ఆర్ట్ కలెక్టర్.

ఏమిటా గుట్టు?

---

"బావగారూ, బావగారూ... అదేంటి అంతమాటనేశారు! అమ్మాయికీ, అబ్బాయికీ పెడతామన్న నగలన్నీ సిద్ధంగా వున్నాయి..." కైలాసం చెప్పకుండా అడ్డు తగిలాడు వైకుంఠం.

"కదా! సిద్ధంగా వున్నాయి కద! పట్రండి, పెట్టండి! నాగవల్లి దాకా నాగా ఎందుకు?"

"అన్నయ్య గారూ... మరేం లేదు... ఏ ముచ్చట ఆ సమయంలో శాస్త్రోక్తంగా చేద్దామన్నదే మా ఉద్దేశం..." వధువు తల్లి నచ్చజెప్తూ అంది.

"చూడమ్మా! మీ శాస్త్రాల్తో నాకు పనిలేదు! మూడు ముళ్ళూ ముహూర్తం దాటకుండా పడాలంటే ముందుగా నగలు పెట్టాల్సిందే!" వైకుంఠం కరా కండిగా అన్నాడు.

"పోన్లెండి! అన్నయ్యగారు చెప్పినట్టే చేద్దాం... నగలు పట్రండి!" కైలాసం గార్ని హెచ్చరించింది ఆయన భార్య.

"అలాగే!" అంటూ కైలాసం చకచకా గదివైపు వెళ్ళాడు...

గదిలోకి వెళ్ళిన కైలాసం రెండు నిముషాల్లో ఇవతలికి వచ్చాడు. వేదిక వద్ద వున్న భార్య సుధను వెంట బెట్టుకుని, మళ్ళీ గదిలోకి వెళ్ళాడు.

"నగల సంచీని సూట్‌కేసులోంచీ తీసి వేరే పెట్టావా?" గదిలోకి వెళ్ళగానే భార్యను అడిగాడు కైలాసం.

"నేనెందుకు మారుస్తాను?" సుధ ఎదురు ప్రశ్నించింది.

"షాపతనిచ్చిన లెదర్‌బ్యాగ్ లేదు.." ముఖాన్ని అలుముకుంటున్న చెమటను తుడుచుకుంటూ అన్నాడు కైలాసం.

సుధ సుడిగాలిలా, గోడవారగా పేర్చిన లగేజీ వైపు తిరిగింది. ఆమె చేతులు చకచక కదుల్తున్నాయి. బ్యాగులూ, బ్రీఫ్‌కేసులూ, శరవేగంగా ఖాళీ అవుతున్నాయి. గుడ్డలూ అవీ చెల్లాచెదరుగా పడుతున్నాయి. వెతకడం పూర్తి చేసిన సుధా ఆందోళనతో భర్త వైపు చూసింది. కైలాసం ముఖం మీద చెమట పూసలు...

"సూట్‌కేస్ తెరిచి, నగల సంచీని ఎవరు తీశారు?" కైలాసం కంఠం వణికింది.

సుధ బలహీనంగా గోడకి జార్లాబడి, గుండెను అరచేత్తో అదుముకుంది. కళ్ళు మూసుకుంటూ. కైలాసం ఏంచేయాలో తేల్చుకోలేక పోతున్నాడు. అప్రయత్నంగా కాళ్ళు అతన్ని గది ముందుకు తీసుకెళ్ళాయి. అతని కళ్ళు నిస్స హాయంగా ఎవరికోసమో వెతుకుతున్నాయి. ఎవరి కోసం వెతుకుతున్నాడు తను? కైలాసం నీరసంగా గోడకి జార్లా బడ్డాడు. కండువాతో ముఖం తుడుచు కున్నాడు.

"అయ్యా కైలాసం గారూ! త్వరగా! త్వరగా రండి! ఆలస్యమైతే యమగండం - వచ్చేస్తుంది!" సిద్ధాంతి అరుస్తున్నాడు.

ముందువరసలో కూచున్న డిటెక్టివ్ టెంపో సిద్ధాంతి అరుపులు వింటూ గది వైపు చూశాడు. గోడకి జార్లాబడిన కైలాసం చేత్తో ఛాతీ రుద్దుకుంటున్నాడు... పక్క కుర్చీలో వున్న ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్‌ని చేత్తో తాకి, టెంపో లేచి, కైలాసం వైపు చకచకా అడుగు లేశాడు. కైలాసం ముందు నిలుచుని, ఆయన ముఖంలోకి చూశాడు.

"కైలాసం గారూ...ఏమిటిలా వున్నారు?"

టెంపో చేతిని పట్టుకుని, దాని ఆధారంతో మెల్లిగా గదిలోకి నడిచాడు కైలాసం. గదిలోకి వెళ్ళగానే పృథ్వీరావ్ తలుపు మూశాడు. డిటెక్టివ్ టెంపో చిందర వందరైన వస్తువులతో గందరగోళంగా వున్న గదిని కలియజూశాడు. నేల మీద కూచున్న సుధ పిచ్చిదానిలా సంచుల్నీ, గుడ్డల్నీ కెలికేస్తోంది.

"నగలు కనిపించడం లేదా!" నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ప్రశ్నించాడు టెంపో.

ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావూ, కైలాసం - యిద్దరూ టెంపో వైపు ఆశ్చర్యంగా చూశారు.

"ఎలా కనిపెట్టాననుకుంటున్నారా?" టెంపో కైలాసం వైపు చూస్తూ అన్నాడు.

"మీరు నగల కోసం గదిలో కొచ్చారు. నగలతో వేదిక మీదికి తిరిగి రాలేదు. గదిలో మీ ఆవిడ గాలిస్తున్నారు! మీరు చెమటలు కక్కుతున్నారు! నగలు వుంటే మీరెందుకు కల్యాణ వేదికకు రాకుండా వుంటారు? ఆవిడెందుకు గదిలో ఇలా గాలిస్తారు?"

"టెంపో గారూ... " కైలాసం కంఠం బొంగురుగా ధ్వనించింది.

"పృథ్వీరావ్! కల్యాణ మండపంలోంచీ ఈగ కూడా వెళ్ళకూడదు! క్విక్!" టెంపో అన్నాడు.

"గాలి కూడా బైటకెళ్ళకుండా దిగ్బంధం చేయిస్తా!" అంటూ పృథ్వీరావ్ పరుగెట్టాడు.

"నగల్ని ఎక్కడ జాగర్త చేశారు?" టెంపో అడిగాడు.

"షాపతనిచ్చిన లెదర్ బ్యాగ్‌లోనే వుంచి, ఆ సూట్ కేసులో జాగర్త చేశాం..."

"వడ్డాణం కూడా అందులోనే వుంది..." సుధ కంఠంలో ఏడుపు వణికింది.

"కైలాసం గారూ! మీరు జాగర్త చేయలేదు; పెట్టారు! కాకపోతే, పడేశారు!" టెంపో పూర్తిగా నోరు తెరిచి, ఖాళీగా వెక్కిరిస్తున్న సూట్‌కేసుని పరీక్షగా చూస్తూ అన్నాడు. "పళ్ళు గుచ్చుకునే పుల్లతో మీ సూట్‌కేసు తాళం తీసేయొచ్చు!"

"దానికి తాళం వేశాం. గదిలో ఎప్పుడూ ఎవరో ఒకరం వుంటున్నాం... ఎవ్వరూ లేకపోతే గదికి తాళం వేస్తున్నాం..." కైలాసం సిగ్గుపడుతూ అన్నాడు.

టెంపో చిరునవ్వు నవ్వాడు. "నగల కోసం గదిలోకి వెళ్తూ, మీరు తాళం తీయలేదు! నేను చూశాను! మీరు తాళం వేయలేదు అంటే, తాళం 'వేయబడి లేదు' - అని అర్థం!"

కైలాసం ముఖం మీద మారుతున్న చెమటని కండువాతో అద్దుకుంటూ, సిగ్గు పడుతూ చూశాడు. "హడావిడిగా వున్నాం... తాళం వేయడం మరిచి పోయామేమో, టెంపో గారూ..."

టెంపో మూసివున్న తలుపు రెక్కల్ని లాగాడు. గొళ్ళానికి తాళం వేళ్ళాడుతోంది. తాళం వేయబడి వుంది. తాళం చెవి కన్నంలో లేదు! టెంపో తలుపులు మూసి, కైలాసం వైపు తిరిగాడు. "కైలాసం గారూ, గొళ్ళెం బిగించకుండా, ఉత్తుత్తిగా వేశారు తాళం..."

"అమ్మాయి పెళ్ళి... ఇప్పుడేమిటి గతి..." కైలాసం బొంగురుగా అన్నాడు.

అప్పటిదాకా సుధలో సుళ్ళు తిరుగుతున్న ఏడుపు అతని ప్రశ్న ఒక్కసారిగా ఇవతలకి చేదింది! ఆమె దీనంగా ఏడుస్తూ చూసింది.

"సుధగారూ! ఏడవకండి!... అందరూ వస్తారు!" టెంపో వోదార్పుగా అన్నాడు. సుధ చీర

కొంగుని నోట్లో దోపుకుని, మౌనంగా రోదిస్తూ వుండి పోయింది. డిటెక్టివ్ టెంపో కోటు జేబులోంచీ ప్యాకెట్ తీసి, సిగరెట్ వెలిగించాడు. పొగ ఊదుతూ కైలా సాన్ని సూటిగా చూశాడు.

'కిటికీ తలుపులు ఎవరు తెరిచారు? మీరేనా?''

కైలాసం అప్పుడే గమనించినట్టు, టెంపో వెనక వైపు నున్న తెరిచిన కిటికీని ఆశ్చర్యంగా చూశాడు. ''దానికి మెష్‌లేదు.. పైగా ఏసీ గది.. మేం తెరవ లేదు...''

టెంపో గిరిక్కున వెనక్కి తిరిగి, కిటికీ దగ్గరగా కదిలి, వెలుపలకి చూస్తూ వుండి పోయాడు. ప్రహరీ గోడ దాకా పచ్చటి తివాచీలా పచ్చిక. మధ్యలో వర సగా క్రోటన్ మొక్కలు.. టెంపో కిటికీలోంచీ పొగ ఊదుతూ కళ్ళు చిట్లించాడు.

''మిస్టర్ కైలాసం... ఇలారండి!''

కైలాసం టెంపో దగ్గరగా జరిగాడు. టెంపో అతని వైపు తిరగలేదు.

''క్రోటన్ల మధ్య చూడండి...''

కైలాసం కళ్లు చిట్లిస్తూ చూశాడు. క్రోటన్ల మధ్య పడి వుంది లెదర్ బ్యాగ్!

''అదే! అదే టెంపోగారూ నగలసంచీ!'' కైలాసం ఆవేశంగా అరిచాడు. ఆత్రంగా గుమ్మం వైపు తిరిగి పరుగెట్టబోయిన అతన్ని చేతిని పట్టుకుని ఆపాడు టెంపో.

''నగలు అందులో వుంటాయని ఆశపడుతు న్నారా? అది ఆశకాదు; అడియాస''.

కిటిలోంచీ సంచీని చూడ్డానికి వచ్చిన సుధ, మళ్ళీ నేల మీద కూలబడింది. కైలాసం ఏడుస్తున్న భార్య దగ్గరగా వెళ్ళి, తలమీద చెయ్యి వేసి, వోదార్చే ప్రయత్నం చేస్తున్నాడు.

టెంపో మొబైల్ డయల్ చేశాడు. ''పృధ్వీ! ఈ గదిలోంచీ కాంపౌండ్‌లోకి కిటికీ వుంది. దాని ముందు క్రోటన్స్. వాటిమధ్య లెదర్‌బ్యాగ్... వెంటనే వెళ్ళి తీసుకో!''

టెంపో కళ్ళు గదంతనీ పరిశీలనగా చూస్తు న్నాయి. గది మూలలో తాగి పడేసిన కొబ్బరి బొండాలు కుప్పగా పడున్నాయి.

''అయ్యా కైలాసం గారూ! త్వరగా! త్వరగా రండి!'' గది ముందు నుంచీ సిద్ధాంతి అరుపులు.. కైలాసం బలహీనంగా టెంపో వైపు చూశాడు.

''టెంపోగారూ... ఏం చేద్దాం?''

''ఎప్పటికైనా చెప్పాల్సిందేగా! ఇప్పుడే చెప్పేద్దాం! రండి!'' టెంపో కైలాసం చేతిని పట్టుకుని గది బైటికి నడిపించాడు.

***

నగలు చోరీ అయిన విషయం కల్యాణ మండ మంతా గాలిలాగా వ్యాపించి పోయింది. అతిథులు గుంపులు గుంపులుగా గుసగుసల్లో మునిగిపో యారు. వేదిక మీద కూర్చున్న వధూవరులు ఏం చేయాలో తెలీని బొమ్మల్లా, కీ అయి పోయిన బొమ్మల్లా కూచున్నారు. వధువు వందన కళ్ళల్లోంచీ ధారలు కట్టిన కన్నీళ్ళు – ఆమె భయాన్నీ, బాధను కొలుస్తూనే వున్న గ్రాపుల్లా సాగిపోతూనే వున్నాయి.

పెళ్ళికొడుకు చూపులు కొబ్బరి కాయ మీద వున్న మంగళసూత్రం మీదే తాపడం అయిపోయి వున్నాయి.

కైలాసం, ఆయన భార్య సుధ; వైకుంఠం, ఆయన భార్య కాంతమ్మ, సిద్ధాంతి; వైకుంఠం తమ్ముడూ, కైలాసం బావగారూ కుర్చీల్లో గుంపుగా కూచు న్నారు. కైలాసం గారి దగ్గరగా కూచున్న డిటెక్టివ్ టెంపో, దగ్గరగా వస్తున్న ఇన్‌స్పెక్టర్ పృధ్వీరావ్‌ని ప్రశ్నా ర్థకంగా చూశాడు.

''దార్లన్నీ సీల్ చేసేశాను! లెదర్ బ్యాగ్‌ని స్వాధీనం చేసుకున్నాను. ఎవ్వరూ బైటికి వెళ్ళలేదు...'' పృధ్వీ రావ్ టెంపో చెవిలో చెప్పి, కుర్చీలో కూచున్నాడు.

''పృధ్వీ! బొండాం అండ్ పార్టీ...'' టెంపో సాలోచనగా అన్నాడు.

''వదుల్దానా? ఒక గదిలో – లాకప్‌లో వుంచా!'' పృధ్వీరావ్ సగ ర్వంగా అన్నాడు. ''లోపల ఫోర్ ఫోర్ ఫోరూ, గుమ్మం బైట రత్నం – అలర్ట్‌గా వున్నారు!''

''బావగారూ... దొరికితే – వెంటనే, దొరక్కపోతే – ఒకే ఒక నెల – రోజులు... నెల రోజుల్లో ఒక్క గ్రాము కూడా తక్కువ కాకుండా నగలన్నీ ముట్ట జెప్తాను! కార్యం జరిగి పోని వ్వండి! నగలు అప్పగించాకే అమ్మా యిని తీసికెళ్ళండి...'' కైలాసం దీనంగా అడిగాడు.

వైకుంఠం వంచిన తలను పైకెత్తి దిగాలుగా చూశాడు. ''బంధువులలో, స్నేహితులలో మా పరువు పోయింది! కైలాసం గారూ... ఒక విషయం చెప్పండి! మీరు నిజంగా నగలు చేయించారా?''

''అదేంటి బావగారూ... అంతమాటన్నారు! డిజైన్లు కూడా మీరు ఓకే చేశాకే కదా, చేయించాను!'' కైలాసం దెబ్బతిన్నట్టు చూస్తూ అన్నాడు.

''డిజైన్లు చూపించడానికేం భాగ్యం! నగలు చేయించారని, చేయించినట్టు నాటకాలాడారా? అనేదే మా బెంగ!'' వైకుంఠం భార్య ఉక్రోషంగా అంది.

''కాంతం..'' వైకుంఠం భార్యకు నచ్చచెప్తున్నట్టు అన్నాడు– ''మునిగి పోయిందేమీ లేదుగా!''

''అయ్యో రాతా! ఇంకా ఏం మునగాలండీ? నా బిడ్డ మీద ఏ పాపిష్టి కళ్ళ దిష్టో పడిందండీ! పోయినే డాది కూడా ఇలాగే...'' కాంతమ్మ గుక్కతిప్పుకుంటూ ఆగింది. ''ఇక లేవండి... జరిగింది చాలు!

''వదిన గారూ... పెద్ద మనసు చేయండి!'' సుధ కాంతమ్మ చెయ్యి పట్టుకుంటూ అంది.

''వదినా లేదూ, వల్ల కాడూ లేదు! ఊరుకో!'' కాంతమ్మ కసిరింది.

''బావగారూ...'' కైలాసం ఆశగా అన్నాడు.

'కైలాసం గారూ... మిమ్మల్నీ, మీ పరిస్థితినీ, ముఖ్యంగా మీ అమ్మాయినీ చూస్తుంటే... నాకు జాలే స్తోంది... కానీ... నేను నిస్సహాయుణ్ని... ఏమీ చేయ లేను.. 'సాలంకృత కన్యాదానం' అన్నారు! అది గుర్తుంచుకుని పీటల మీదికి తెచ్చే ముందే మీరు నగలు అలంకరించి వుండాలి..''

''అయ్యో రాత! మీరు మరీ... నగలు చేయించి వుంటే గదండీ... అలంకరించడానికి! ఆ మాత్రం తెలీదూ! ఆ మూడు ముళ్ళు పడితే – ఇదిగో – ఇప్పుడు ఆడుతున్నారే – యీ దొంగతనం నాటకం – ఆడి, చుక్కలు చూపించి వుంటారు! కాదూ కూడదని మనం ఉంటే కట్నం కేసుందిగా'' కాంతమ్మ గుడ్లురు ముతూ అంది.

''వైకుంఠంగారూ... అమ్మాయి ముఖం చూడండి! ఆలోచించండి! కైలాసం గారు మాటకు కట్టుబడే వ్యక్తి! నెలలోగా...'' టెంపో మాటకు వైకుంఠం అడ్డు తగిలాడు.

''టెంపోగారూ.. మీకు తెలీదు! మీరూరుకోండి! ఇవాళ రేపూ ఆడపిల్లల తల్లి దండ్రుల పెళ్ళిళ్ళప్పుడు ఆడే నాటకాలు మీ కర్థం కావు. మాది స్వానుభవం! ఆ!'' అంటూ సగం తాగిన కూల్‌డ్రింక్ బాటిల్ని ఠపీ మని నేలమీద పెట్టి పైకి లేచాడు వైకుంఠం.

''కాంతం... లే.. సామాన్లన్నీ సర్దించు! వచ్చిన పని వాకిట్లోనే అయిపోయింది!'' అన్నాడు భార్యను చూస్తూ... ''అబ్బాయిని లేవగొట్టు! వడ్డించని విస్తరి


ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట్, హైదరాబాద్. 500-073.
ఫోన్స్: 040 - 23747777, 9391999999

FREE online Registration &
Free search



www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com



అమీర్‌పేట | నెల్లూరు
కూకట్‌పల్లి | తిరుపతి
దిల్‌షుఖ్‌నగర్ | కర్నూలు
విజయవాడ | (చెన్నయ్) టి.నగర్
గుంటూరు | బెంగుళూర్
తెనాలి | సేలం
విశాఖపట్నం | మధురై
రాజమండ్రి | వెల్లూరు
కాకినాడ | తిరుచి
ఖమ్మం | పాండిచ్చేరి
ఒంగోలు | ఈరోడ్
| ఏలూరు

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.



ముందు కూచున్నట్టు వాడెందుకు అక్కడ?''

కైలాసం కుర్చీలోంచీ లేచి, వైకుంఠం ముందు నేలమీద కూచుని, రెండు అరచేతుల్నీ ఆయన పాదాల మీద వుంచాడు. తల పైకెత్తి నీళ్ళు నిండిన కళ్ళతో దీనంగా చూశాడు. ''బావగారూ.. నన్ను నమ్మండి! నగలు చేయించాను! పోయాయి! పోతే పోయాయి! మళ్ళీ చేయిస్తాను... అమ్మాయి జీవితాన్ని...''

వైకుంఠం అందర్నీ కలియజూశాడు. ''ఏమిటండీ ఇతను! కాళ్ళు పట్టుకుంటాడేంటి అసహ్యంగా! ఛీ ఛీ!''

''బావగారూ..''

టెంపో కుర్చీలోంచీ లేచాడు. ''కైలాసం గారూ... పైకి లేవండి!'' కైలాసం పైకి లేచి, బలహీనంగా చూశాడు.

''కైలాసం గారూ... ఆఫ్టరాల్ ఏం జరిగిందిప్పుడు? పెళ్ళి ఆగిపోయింది! చరిత్రలో చాలాచాలా పెళ్ళిళ్ళు పీటల మీద ఆగిపోయాయి! మీరు అడగాల్సిందేదో అడిగారు! వైకుంఠంగారు చెప్పాల్సిందేదే చెప్పారు! కాళ్ళూ కడుపులూ పట్టుకోడం దేనికీ? గుండె దిటువు చేసుకోండి!''

''టెంపోగారూ!''

''ముందు వందన వద్దకెళ్ళి, ధైర్యం చెప్పండి!'' టెంపో సీరియస్‌గా అని, ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ వైపు తిరిగాడు. ''పృథ్వీ! అతిథులందర్నీ భోజనాలకి పంపించు. ఫింగర్ ప్రింట్స్ వాళ్ళని రమ్మని! క్విక్! అది కిటికీ లోపల్నుంచీ తెరిచారెవరో! నగల దొంగే అని నా నమ్మకం! సంచీ గిరాటేశాడుగా! కిటికీ మీద వేలి ముద్రలు గ్యారెంటీగా వుంటాయి!''

''యస్! తలుపు మీద కూడా వుండొచ్చు!'' అంటూ ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ వేగంగా కదిలాడు.

''పృథ్వీ!'' డిటెక్టివ్ టెంపో పిలిచాడు.

పృథ్వీరావ్ ఆగి, చూశాడు. ''ఏమిటి టెంపో?''

''గదిలో బంధించిన కేడీగాళ్ళను ఇంటరాగేషన్‌కి పంపించు! నగల సంచీని కిటికీ గుండా తోడు దొంగలకి అందించారనిపిస్తోంది!'' టెంపో సాలోచనగా అన్నాడు. ''ఇంటరాగేషన్...''

''పవర్‌ఫుల్‌గా వుంటుంది! వుందిగా థర్డ్ డిగ్రీ! కక్కిస్తా! నిజాన్నీ! నగల్నీ!'' అంటూ ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ స్పీడుగా వెళ్ళాడు.

సిద్ధాంతి దగ్గి గొంతు సవరించుకున్నాడు ''అయ్యా. వైకుంఠం గారూ... శుభ కార్యానికేమో పురిట్లోనే సంధి కొట్టింది! మరి నా సంగతి...''

''చాల్లేవయ్యా... పెట్టావు, వెధవ ముహూర్తం! నువ్వీ ముహూర్తం పెట్టినప్పుడే ఆపశకునమైంది! అప్పుడే తెలుసు నాకు.... ఇది కడతేరేకల్యాణం కాదని... శాస్త్రం తెలీనప్పుడు వేరేపని చూసుకుని ఏడవొచ్చుగా! ఇలా అశుభ ముహూర్తాలు పెట్టకపోతే!''

''ఏం చేయమంటారండీ?'' సిద్ధాంతి రోషంగా అన్నాడు. ''నేను కూడా చదివాను. ఎం.ఏ. బి.ఇడి., ఉద్యోగం యిచ్చేవాడెవడూ? రిజర్వేషన్లు మా కాళ్ళూ చేతులు కట్టేశాయిగా! బతకాలి! ఏదో. తెలిసిన చావో, తెలీని చావో చస్తూ ఇంత పిండం తింటున్నాం! ఒకరిద్దర్ని చంపకుండా వైద్యుడు కాలేదన్నట్టు... ఈ ముహూర్తాలు అంతే! మాకూ రావాలిగా, అనుభవం!''

వైకుంఠం మాట్లాడకుండా అక్కణ్నుంచీ కదిలాడు.

''నా కడుపు కొట్టినవాడు నాశనమై పోతాడు!'' సిద్ధాంతి సణిగాడు.

''సిద్ధాంతిగారూ! మీరు నిర్ణయించిన ముహూర్తం మంచిదే! దొంగకి బాగా అచ్చొచ్చింది!'' డిటెక్టివ్ టెంపో నవ్వాడు.

''అయ్యా... నిజం చెబుతున్నాను. ఇది నేను సిద్ధాంతం చేసిన ముహూర్తమండీ! వరుడి కుటుంబానికి లాభం చేకూర్చే దివ్యమైన ముహూర్తం! అమ్మాయిని చూశారుగా! కుందనపు బొమ్మ! తెలీకడుగుతాను... ఆ నగలు దిగేసి, అ అమ్మాయి అందాన్ని పాడు చేయడం దేనికండీ!''

''బాగా చెప్పారు!'' అంటూ టెంపో పైకి లేచాడు.

***

గంట గడిచింది. 'కాని పెళ్ళి - భోజనాలు' చేసిన అతిథులు హాల్లో కుర్చీలో కూచున్నారు. సిగరెట్ పీలుస్తూ నించున్న టెంపోను సమీపించాడు పృథ్వీరావ్.

''అతిథులందర్నీ - ఒక్కొక్కర్నే సోదాచేసి బైటికి పంపేస్తాను!''

''వద్దు! అతిథులందరూ వుండాలి...'' టెంపో అన్నాడు. పృథ్వీ గదిలో వేలి ముద్రలు తీయించావుగా?''

''కిటికీ చిరతమీదా, రెక్కల మీదా - ఎక్కడా వేలి ముద్రలు లేవు! శుభ్రంగా తుడిచి క్లీన్ చేసినట్టున్నాయన్నాడు ఎక్స్‌పర్ట్...''

''కిటికీమీద వేలి ముద్రలు - వుండవు! నాకు తెలుసు!'' టెంపో గంభీరంగా అన్నాడు; ముందు వరసలో కూచుని దిగాలుగా చూస్తున్న కైలాసం దంపతుల్నీ, వధువు వందననూ చూస్తూ.

''గూరు... వేలి ముద్రలు వుండవని తెలిసీ, ఎందుకు చెక్ చేయమన్నావ్?'' పృథ్వీరావ్ అడిగాడు.

''చెక్ చేయించమని నేను అన్నప్పుడు వున్నాయి. చెక్ చేసేటప్పుడు లేవు మాయమయ్యాయి!''

''మాయమయ్యాయా?'' పృథ్వీరావ్ కళ్ళు చిట్లిస్తూ అన్నాడు. ''ఓ... తుడి చేశారా? ఎవరు?''

''దొంగ...''

''ఎవరు?'' పృథ్వీరావ్ అడిగాడు.

''పృథ్వీరావ్... అటుచూడు... మగ పెళ్ళివారు గదులు ఖాళీచేసి వెళ్ళిపోతున్నారు.. వాళ్ళు వెళ్ళిపోయాక చెప్తాను!'' లగేజీ మోసుకుంటూ వెళ్తున్న మను షుల్నీ! పెళ్ళి కొడుకునీ, అతని తల్లిగారినే చూస్తూ అన్నాడు టెంపో.

''టెంపో... మా ప్రాసీజరొకటుంది! తెలుసుగా! సోదా చేసేట్టయితే, మగ పెళ్ళి వాళ్ళ మూట ముల్లే కూడా సోదా చేయాలి! ఏమంటావ్?''

''వదిలేయ్ పృథ్వీ! పెళ్ళి పెటాలకులైనందుకు ఇప్పుడే ఆగ్రహంతో వున్నారు? సోదా చేసి, ఆ ఆగ్రహానికి అవమానం జత చేయడం దేనికీ?''

''టెంపోగారన్నది నిజమే! సోదాలు వద్దు! వాళ్ళను వెళ్ళనివ్వండి!'' కైలాసం గారు విరక్తిగా అన్నారు.

వైకుంఠం వాళ్ళ దగ్గరగా వచ్చాడు. నిస్పృహయంగా కైలాసం వైపు, వధువు వైపు చూశాడు. ''కైలాసం గారూ... ఆగిపోయింది మీ అమ్మాయి పెళ్ళి మాత్రమే కాదు; మా అబ్బాయి పెళ్ళికూడా! మీరు ఏమీ చేయలేరు; నేనూ ఏమీ చేయలేను... అబ్బాయి, వాళ్ళమ్మా నా మాట వినరు! వస్తాను!''

కైలాసం రెండు చేతులా ఎత్తి నుదురుమీద జోడించాడు, మౌనంగా.

''వైకుంఠంగారూ! నగల దొంగ దొరికాడు! కాస్సేపు ఆగి వాణ్నీ, నగల్నీ చూసి వెళ్ళండి! కనీసం కైలాసంగారు నాటకాలు ఆడలేదనీ, నగలు నిజంగానే చేయించారనీ మీకు రూఢి అవుతుంది...'' టెంపో చిరునవ్వుతో అన్నాడు.

''దొంగ దొరికాడా!! గంట క్రితం దొరికితే ఎంత బావుండేది? నగలు దొరికాయా?.... అయినా ఏం లాభం! ఈ పెళ్ళి జరగదు! ముహూర్తం కొండెక్కిపోయింది! యమగండం వచ్చేసింది! ముఖ్యమైన పాయింటేమిటంటే - మాకు అన్నీ అపశకునాలే!'' వైకుంఠం విచారంగా అన్నాడు.

డిటెక్టివ్ టెంపో వందలాది మంది అతిథుల్ని కలియజూశాడు.

''మీ అందరికీ అసౌకర్యం కలిగించాం. క్షమించాలి! మీ అందరిముందూ జరగాల్సిన పెళ్ళి ఆగిపోయింది. అందుక్కారణం పెళ్ళి కూతురికి తండ్రి పెట్టే నగల సెట్టు చోరీ కావడం! చోరీ ఎవరు చేశారు? మనలో ఎవరైనా కావచ్చు! నగలు గడప దాటకుండా వుండటానికి అవసరమైన జాగ్రత్తలన్నీ తీసుకున్నాం!

''చాలాతెలివిగా నగల్ని కాజేసిన దొంగ - చిన్న పొరపాటు చేశాడు! ఆ పొరపాటు అతన్ని నాకు పట్టిచ్చింది! నగలు కాజేసిన వ్యక్తి, నిజంగా జిత్తులమారి! నగల సంచీని కిటికీగుండా బైట పారేసి,

నగలు బైటికి జారి పోయినట్టు వూహించే అవకాశం కల్పించాడు. నగలతో మనతోబాటు కల్యాణ మండ పంలో వుండిపోయాడు..''

''టెంపో... చిన్న సందేహం...'' ఇన్‌స్పెక్టర్ పృథ్వీ రావ్ అడ్డుతగుల్తూ అన్నాడు. ''బైటికి వెళ్ళే ప్రతి దాన్నీ, 'ప్రతి వ్యక్తినీ మనం సోదా చేస్తాంగా! దొంగ నగల్ని ఇక్కడే వుంచుకున్నాడని నేను అనుకోను!''

టెంపో చిరునవ్వుతో పృథ్వీరావ్ వైపు చూశాడు. ''థాంక్స్ పృథ్వీ! అతిథు లందర్లోనూ కలిగే సందే హాన్ని వ్యక్తం చేశావ్! నువ్వు పెళ్ళికూతురు పార్టీ లగే జీని సోదా చేస్తావా?''

''....చేయను!'' ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ వెంటనే అన్నాడు.

''వధూవరులకు చదివించడానికి తేబడిన గిఫ్టు ప్యాకెట్స్ సోదా చేస్తావా?''

''అది.... చేయను..'' పృథ్వీరావ్ తడబడుతూ అన్నాడు. ''నిజం చెప్పాలంటే... రూల్సు ప్రకారం... తప్పకుండా చేస్తాను!''

సర్దుకుంటూ, తనను దిద్దుకుంటూ అన్న పృథ్వీ రావ్‌ని టెంపో చిరునవ్వుతో చూశాడు.

''నిజమా? నమ్మమంటావా?'' టెంపో నవ్వుతూ అన్నాడు.

''అయితే నీ నిజాయితీ నిరూపించుకో ఇన్‌స్పెక్టర్! ఇదిగో... మన వైకుంఠంగారి చేతుల్లో వున్న గిఫ్టు ప్యాకెట్‌ని సోదా చెయ్!''

''గురూ...'' పృథ్వీరావ్ నోరు తెరిచాడు.

''టెంపో గారూ... బలేవారే.. మాంగల్యధారణ జరిగాక, మా కోడలయ్యాక, పెళ్ళి కూతురికివ్వడానికి నేను తెచ్చిన గిఫ్ట్ ఇది!'' వైకుంఠం నవ్వుతూ అన్నాడు. అందరూ నవ్వారు.

''కమాన్ పృథ్వీ... కోడలై వుంటే - వైకుంఠం గారు పెళ్ళి కూతురికి ఇవ్వాలని స్పెషల్‌గా తెచ్చిన ప్యాకెట్‌లో ఏ గిఫ్ట్ వుందో చూద్దాం! సోదా చెయ్!''

''మిస్టర్ టెంపో! మీరు నన్ను అవమానిస్తు న్నారు!'' వైకుంఠం కోపంగా అన్నాడు.

''నో మిస్టర్ వైకుంఠం! అనుమానిస్తున్నాను! త్వరలో అవమానిస్తాను!'' టెంపో గంభీరంగా అన్నాడు. ''పృథ్వీ!''

పృథ్వీరావ్ తటాలున వైకుంఠం చేతుల్లోని గిఫ్ట్ ప్యాకెట్‌ని లాక్కున్నాడు. కదల బోయిన వైకుంఠం ముంజేతిని టెంపో వేళ్ళు, ఇనప కడ్డీల్లా చుట్టేశాయి.


''మైగాడ్!'' ప్యాకెట్ వోపెన్ చేసిన పృథ్వీరావ్ నిర్ఘాంతపోతూ అరిచాడు. అతని కుడిచేయి వడ్డా ణాన్నీ, గొలుసుల్నీ, నెక్లెస్‌నీ పైకెత్తి పట్టుకుంది. ఆశ్చర్యం వేలాది కంఠాల గుండా హాల్లో ప్రతిధ్వనిం చింది.

''అవి... అవి... అమ్మాయికి నేను చేయించిన నగలే!'' లేచి పృథ్వీరావ్ దగ్గరగా వస్తూ అరిచాడు కైలాసం. సుధ ఆత్రంగా భర్తను అనుసరించింది.

టెంపో చేతిపట్టు నుంచీ విడిపించుకోడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్న వైకుంఠాన్ని పోలీసులు చుట్టే శారు.

''పెళ్ళికొడుకు తండ్రి అయిన వైకుంఠంని నేను ఎందుకు అనుమానించాను?'' డిటెక్టివ్ టెంపో ప్రశ్న రూపంలో తన వివరణ ప్రారంభించాడు. ''నెలలోగా మరో సెట్టు నగలు చేయించి యిస్తాననీ, పెళ్ళి జరిగి పోనివ్వమనీ ప్రాధేయపడుతూ, కైలాసంగారు అతని కాళ్ళు పట్టుకున్నారు. వైకుంఠం భార్య కోపంగా రియాక్టైంది. 'పోయినేడాదీ ఇలాగే జరిగింది!' అంటూ వాపోయిందామె! 'మీకు తెలీదు! మీరూరు కోండి! మాది స్వానుభవం!' అంటూ నన్ను కసిరాడు వైకుంఠం.

''పోయినేడాదీ వీళ్ళకి ఇలాగే జరిగిందా? ఇలాం టిది వైకుంఠానికి స్వానుభవమా? అనే ప్రశ్నలు నాలో అనుమానబీజాన్ని నాటేయి! ఏ తండ్రీ తన కూతురి పెళ్ళికి చెప్పిన నగలు చేయించకుండా నాటకం ఆడేంత సాహసం చేయడు! మరో విషయం: గదిలో కిటికీ తలుపులు తెరిచి వున్నాయి! అది ఏ.సీ. గది. తామెవరూ కిటికీని తెరవనేలేదన్నారు కైలాసం గారు. అయితే కిటికీ ఎలా తెరుచుకుంది? ఎవరు తెరిచారు? నగల దొంగ తెరిచాడు? ఎందుకు? ఖాళీ చేసిన నగల సంచీని బైటికి గిరాటేయడానికి? అదెందుకు? నగలు కాజేసిన దొంగ తోడుదొంగకు నగలు అందించాడనీ, నగలు ఎల్లలు దాటేశాయని తప్పు దారి పట్టించడా నికి! అంటే దొంగ కిటికీ తెరిచాడు. అతని వేలి ముద్రలు చిడతల మీదా, కిటికీ రెక్కల మీదా వుండి తీరాలి! వైకుంఠం సమక్షంలో - వేలిముద్రలు తీయిం చమని ప్రత్యేకంగా ఉద్దేశ పూర్వకంగా ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్‌కి చెప్పాను! అందర్నీ డైనింగ్ హాల్లోకి పంపేశాం. కైలాసం గారి కుటుంబాన్ని వేరే గదిలో వుంచాం! లక్షలాది రూపాయల నగలు పోయాక, ఆ



గది గురించి వాళ్ళు పట్టించుకోలేదు, సహజంగా! వాళ్ళ విచారంలో వాళ్ళున్నారు! మెల్లగా జారుకుని, దొంగతనం జరిగిన గదిలో, బాత్‌రూంలో దాక్కుని కాచుక్కూచున్నాను! నా ఊహను నిజం చేస్తూ, వేలి ముద్రల్ని చెరిపి వేయడానికి – గదిలోకి వచ్చాడు, రహస్యంగా వైకుంఠం. కిటికీని తుడుస్తున్న అతని కార్యక్రమాన్ని నా మొబైల్ వీడియోలో బంధించాను!'' టెంపో ఆగి, వైకుంఠం వైపు చూశాడు. అతని ముఖంలో నెత్తురంతా ఇంకిపోయింది!

''టెంపోగారూ! ఈ దౌర్భాగ్యుడు ఎందుకీ ఘోరం చేశాడు. ఆ నగలు మా అమ్మాయి ద్వారా వాడికొంపకే చేరేవిగా?'' కైలాసం ప్రశ్నించాడు.

''ఎందుకు నగలు కాజేశాడంటే – పెళ్ళి ఆపించడానికి!'' టెంపో నవ్వుతూ అన్నాడు.

''ఎందుకు? నచ్చి, మెచ్చిన సంబంధమేగా?''

''ఎందుకంటే – మరో ఖరీదైన, కట్నకానుకలు ఎక్కువగా యిచ్చే సంబంధం చేసుకోడానికి!'' టెంపో నవ్వాడు. ''మీ 'వైకుంఠం బావ' గారిది మాస్టర్ ప్లాన్! ఒక్క షాట్! రెండు సిక్సర్లన్న మాట! మీ అమ్మాయి నగలు తేరగా దక్కాయి! పెళ్ళాగిపోయింది! మరో సంబంధం రెడీగా వుంది..''

''గురూ .. ఈ స్కాండ్రల్ పథకం ఎలా ఊహించావ్?'' ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ అడిగాడు.

''బుర్రతో ఊహించలేదు; చెవుల్తో విన్నాను!'' టెంపో నవ్వుతో ''కిటికీ మీది వేలి ముద్రలు మాయం చేశాక, ఏమీ ఎరగని వాడిలా, చిందరవందరగా పడున్న వస్తువుల్ని కెలుకుతూ, ఎవరైనావస్తే నగల కోసం వెతికే మంచి వ్యక్తిలా కనిపించే ప్రయత్నం చేస్తూ సెల్ డయల్ చేసి ఎవరితోనో మాట్లాడాడు. 'ప్లాన్ సక్సెస్! ఆ సంబంధం వోకే! ముహూర్తం పెట్టించెయ్' అన్నాడు. తోడు దొంగతో కాబోలు! వైకుంఠం మొబైల్‌లోని డయల్డ్ నంబర్సులో ఆ తోడు దొంగ నంబరు నీకు దొరుకుతుంది!''

పృథ్వీరావ్ ఆదరాబాదరా, వైకుంఠం జేబులోంచి మొబైల్ తీసుకుని, తన జేబులో వుంచేసుకున్నాడు.

''టెంపోగారూ... బుద్ధిగడ్డి తిని తప్పు చేశాను. క్షమించండి.. కైలాసం బావగారి కూతుర్ని నా కోడలిగా చేసుకుంటాను...'' వైకుంఠం ప్రాధేయపడ్డాడు.

కైలాసం అతని వైపు తిరిగి అనుమానంగా చూశాడు. ''ముహూర్తం దాటి పోయింది.... యమగండం వచ్చేసింది... ఎలా బావగారు?''

వైకుంఠం మొహం మీద చిరునవ్వు కదలాడింది. ''అబ్బే... జీలకర్రా బెల్లం సమయానికి పెట్టేశావ్, మాంగల్యధారణ కొంచెం లేటైనా మరేం ఫర్వాలేదు బావగారూ!''

కైలాసం కుడిచెయ్యి త్రాచుపాము పడగలా కదిలింది. వైకుంఠం చెంప ఛెళ్ళు మంది. వైకుంఠం బుగ్గ బూరెలా పొంగింది. ''దరిద్రుడా! నీ కాళ్ళు పట్టుకున్నాను కదా! నిన్ను నరికినా పాపం రాదురా, స్కాండ్రల్!''

కైలాసం చెయ్యి మళ్ళీ కదిలింది. కుడి చెయ్యి వెనక భాగం యీ సారి వైకుంఠం కుడి చెంపని పగలేసింది.

''చేత్తోకాదండీ, చెప్పుతో కొట్టండి, పాపిష్టి వాణ్ని!'' కైలాసం భార్య సుధ ఉక్రోషంతో అంది. కైలాసం ఎడం చేత్తో వైకుంఠం చొక్కా ముందు భాగాన్ని పట్టుకున్నాడు. అతని మొహంలోకి గుడ్లురుముతూ చూశాడు.

''కైలాసం గారూ... వాణ్నీ మీ రబ్బరు చేతుల్తో ఎంతకొట్టినా లాభం లేదు. మా వాళ్ళున్నారు! వాళ్ళు ఒక చెయ్యి చూసుకుంటారు! మీరు పెళ్ళికి ఏర్పాటు చేసిన బాజభజంత్రీలతో వీణ్ని స్టేషన్‌కి ఊరేగింపుగా తీసుకెళ్తాను. కాసేపాగి మీరు రండి! కంప్లెయింట్ రాసివ్వండి!''

కైలాసం ఆవేశాన్ని అణుచుకుంటూ వైకుంఠాన్ని నిప్పులు కక్కుతూ చూశాడు. ఎవ్వరూ ఊహించని విధంగా అతని మొహమ్మీద తుపుక్కుమంటూ ఉమ్మేశాడు!

''టెంపోగారూ... యీ దరిద్రుడు చేసిన నిర్వాకంలో పెళ్ళానికీ, కొడుక్కీ వాటాలున్నాయా?'' కైలాసం భార్య సుధ ప్రశ్నించింది.

''ఆ రహస్యాన్ని మన పృథ్వీరావ్ కక్కిస్తాడు!'' టెంపో నవ్వుతూ అన్నాడు. ''పృథ్వీరావ్! మన ప్లాన్‌లో భాగంగా కొబ్బరి బొండాం కేడీ పార్టీని కస్టడీలోకి తీసుకున్నావ్‌గా! వాళ్ళని వదిలెయ్, పాపం!''

పృథ్వీరావ్ సమాధానం చెప్పబోయేలోగా అతని జేబులోని మొబైల్ మోగింది. పృథ్వీరావ్ మొబైల్‌ని చెవికి జతచేసి, యస్!'' అన్నాడు. కాసేపు నోరు వెళ్ళబెట్టి వింటూ వుండిపోయాడు. ''అలాగా! వస్తున్నా!'' అంటూ ఫోన్ కట్ చేశాడు. డిటెక్టివ్ టెంపో వైపు అయోమయంగా చూశాడు.

''ఏమిటి పృథ్వీ?'' టెంపో ప్రశ్నించాడు.

''మరేం లేదు... ఇంటరాగేషన్‌లో కొబ్బరి బొండాం కేడీగాడు దుర్గయ్య – నగలు కాజేసినట్టు వొప్పేసుకున్నాట్ట!''

అందరూ గొల్లున నవ్వుతూ వుండిపోయారు. పోలీసులు పృథ్వీరావ్ సైగతో వైకుంఠాన్ని లాక్కుంటూ వెళ్ళారు.

పెళ్ళికూతురు వందన మెల్లగా నడుస్తూ డిటెక్టివ్ టెంపో దగ్గర వచ్చింది. ఒకసారి అతని కళ్ళలోకి చూసి, వెనక్కి తిరిగింది. తన వెనక నిలుచున్న పాప చేతుల్లో దండను తీసుకుని తటాలున టెంపో మెడలో వేసింది.

''నా నగల్ని దక్కించి, దొంగను పట్టుకున్న టెంపోగారికి ఇది నేను చేస్తున్న సన్మానం!'' వందన అంది. ఆనంద భాష్పాలతో ఆమె కళ్ళు మెరుస్తున్నాయి.

అందరూ చప్పట్లు తట్టారు. సిద్ధాంతి కైలాసం ముందుకెళ్ళారు.

''అయ్యా, కైలాసం గారూ! ఆ వైకుంఠాన్ని నమ్మి మునిగి పోయాను, వాడికి తద్దినం పెట్టా! నా శ్రమను మీరు గుర్తించాలి!''

''అలాగలాగే! తప్పకుండా!'' కైలాసం నవ్వుతూ అన్నాడు.

''సిద్ధాంతిగారూ – మీరు నిర్ణయించి ముహూర్తం సుమూహర్తమూ కాదు; రాహుకాల ముహర్తమూ కాదు! ఆ వైకుంఠం గాడు అన్నట్టు అది – వాడికి యమగండమే!'' డిటెక్టివ్ టెంపో నవ్వుతూ అన్నాడు.

అతిథులందరూ ఆనందంగా నవ్వారు.

★



## కాజల్ కలల రాకుమారుడు....

కాజల్ 'మగధీర' మూడ్ నుంచి బయటపడడం లేదని పరిశ్రమలోని వారు అంటున్నారు. 'మగధీర' సక్సెస్ అనంతరం కాజల్ మాటల్లో విపరీతమైన మార్పు వచ్చిందన్నది వారి ఆరోపణ. ఎందుకంటే ఇటీవలే కాజల్ తనకు కాబోయే భర్తకు ఉండవలసిన లక్షణాలను వివరించిందట! తన కాబోయే భర్త తనకన్నా పొడుగ్గా ఉండాలట! అతనికి మంచి హృదయం ఉండాలట! మంచి సెన్సాఫ్ హ్యూమర్ ఉండి, తనను ఎప్పుడూ నవ్విస్తూ ఉండాలట! వీటన్నిటి కన్నా 'మగధీర'నే లైఫ్ పార్టనర్‌గా చేసుకుంటే సరిపోతుంది కదా! అని వారు గొణగడం ముక్తాయింపు.